# అర్హులకు లబ్ధి చేకూరేనా?



జడ్చర్ల మున్సిపాలిటీలోని14వ వార్డులో దరఖాస్తుదారుల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- జడ్చర్ల మున్సిపాలిటీకి 671, మండలంలో 591 ఇళ్లు కేటాయింపు
- జాబితాలో అర్హుల పేర్లు గల్లంతయ్యాయని ఆరోపణలు

**జడ్చర్ల టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక కసరత్తు ప్రారంభమైంది. నియోజకవర్గానికి 3వేల ఇళ్లు మంజూరు కాగా.. జనాభా ప్రాతిపదికన జడ్చర్ల మున్సిపాలిటీకి 671, మండలంలో 591 ఇళ్లు కేటాయించారు. ఈ మేరకు ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఎంపిక చేసేందుకు గాను శుక్రవారం నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మున్సిపాలిటీలో దాదాపు 2,300, మండలంలో 10వేల దరఖాస్తులు అందాయి. వాటిలో మున్సిపాలిటీలో ఇంటి జాగా ఉండి నిర్మాణం చేసుకుంటామని 1,208 మంది దరఖాస్తు చేసుకున్నారు. జాగ లేకుండా ఇళ్లు కావాలని కోరుకుంటూ 1,000 మందికి పైగా దరఖాస్తు చేసుకోగా.. వీరిలో వడబోత చేపట్టి దాదాపు 600 దరఖాస్తులను తిరస్కరించారు. ఇక ఉన్న దరఖాస్తుల్లో 400 మందికి పైగా అర్హులైనప్పటికీ సొంత జాగ లేకపోవడంతో వారి జాబితాను పక్కన పెట్టారు. మండలంలో 10వేల మంది ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా.. సొంత జాగా ఉన్న వారు 3వేల మంది వరకు ఉన్నారు. వీరిలో ఇప్పుడు కేవలం 591 మందికి మాత్రమే ఇళ్లు కేటాయించనున్నారు. మున్సిపాలిటీలో అర్హుల పేర్లు గల్లంతయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికేతరుల పేర్లు జాబితాలో ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి.

**ప్రత్యేకాధికారుల నియామకం..**

మున్సిపాలిటీలో 27 వార్డులు ఉండగా.. ప్రతి రెండు వార్డులకు ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. వీరు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి 1,208 మంది దరఖాస్తుదారుల్లో 671మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. అదే విధంగా మండలంలోని 45 జీపీల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నేరుగా ధరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి పరిశీలించి.. ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో చేపట్టిన విచారణను జడ్చర్ల పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, మండలంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి, సీఈఓ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

**పారదర్శకంగా ఎంపిక..**

ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వకండి. లబ్ధిదారుల ఎంపిక మొత్తం పారదర్శకంగా ఉంటుంది. ఈ ఏడాది మున్సిపాలిటీకి 671 ఇళ్లు కేటాయించారు. సొంత జాగా ఉండి అర్హత ఉంటే.. వార్డు అధికారి వచ్చినప్పుడు అన్ని వివరాలు సక్రమంగా చెప్పండి. పైరవీకారులను ఆశ్రయించవద్దు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం.

– కోనేటి పుష్పలత, చైర్‌పర్సన్, జడ్చర్ల మున్సిపాలిటీ

**అవకతవకలకు తావులేకుండా..**

మున్సిపాలిటీలోని 27 వార్డు ల్లో ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక కోసం 14 మంది (రెగ్యులర్ ఉద్యోగులు) వార్డు అధికారులను నియమించాం. వారు ఇదివరకే ఎంపిక చేసిన 1,208 మంది దరఖాస్తు దారుల్లో 671మందిని ఎంపిక చేస్తారు. సొంత జాగా ఉండి ఇల్లు కట్టుకుంటామన్న వారికే ప్రాధాన్యత ఉంటుంది. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. ఈనెలాఖరు కల్లా జాబితా సిద్ధం చేస్తాం.

– లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్

**గ్రామాల్లో ఎంపిక షురూ..**

గ్రామపంచాయతీల్లో కార్యద ర్శి, ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక షురూ అయ్యింది. జాగా ఉండి ఇల్లు కావాలని 3వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల్లో చెక్ లిస్ట్ ఆధారంగా 591 మందిని ఎంపిక చేయాల్సి ఉంది. ఎంపిక అంతా పారదర్శకంగా ఉంటుంది.

– విజయ్‌కుమార్, ఎంపీడీఓ

## క్లుప్తంగా

### నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూ భారతి చట్టంపై సోమవారం రాజాపూర్, బాలానగర్ మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయేందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. బాలానగర్‌లో ఉదయం 9గంటలకు, రాజాపూర్‌లో మధ్యాహ్నం 2గంటలకు సదస్సులు ప్రారంభమవుతాయని.. అన్ని గ్రామాల రైతులు పాల్గొనాలని కోరారు.

### విద్యార్థినికి సన్మానం

**జడ్చర్ల టౌన్:** మండలంలోని మాటుబండతండా గ్రామపంచాయతీ గొల్లోనిదొడ్డి తండాకు చెందిన విద్యార్థిని కీర్తన ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 461/470 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దీపక్ రాథోడ్ విద్యార్థినిని శాలువాతో సత్కరించి రూ. 5వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా రాణించి తండాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థిని కీర్తన తల్లిదండ్రులు ప్రభాకర్, స్వాతి, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

### 35వ వారానికి చేరిన అన్నదాన కార్యక్రమం



**నవాబుపేట:** మండల కేంద్రంలో జరిగే వారాంతపు సంతకు వచ్చే ప్రజలతో పాటు రైతులు, వ్యాపారుల ఆకలి తీర్చేందుకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి చేపట్టిన అన్నదాన కార్యక్రమం ఆదివారంతో 35వ వారానికి చేరింది. దాదాపు 70 గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు వారాంతపు సంతకు వస్తుంటారు. వీరికి అన్నదాన కార్యక్రమం వరంలా మారింది. తాజాగా చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో వ్యాపారం సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్ ఆచారి,పుట్టి ఆంజనేయులు,నిరంజన్,విశ్వనేత్ర, శర్మ,బాబ్లు, వెంకటయ్య పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిక



**అడ్డాకుల:** మండల కేంద్రంతో పాటు రాచాల గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అడ్డాకులకు చెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కావలి రాజు, సీనియర్ నాయకుడు రవికుమార్‌తో పాటు రాచాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులకు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండా జగదీశ్వర్, విజయమోహన్‌రెడ్డి, తిరుపతయ్య యాదవ్, నర్సింహులు, వెంకట్రామారావు తదితరులు పాల్గొన్నారు.

### సత్రం నిర్మాణానికి అనుమతివ్వాలని వినతి

**చిన్నచింతకుంట:** కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదాన సత్రం నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆదివారం ఆర్యవైశ్య సంఘం నాయకులు దేవస్థానం చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదాన సత్రం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ నిత్యాన్నదాన సత్రం నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### సరస్వతీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** అమావాస్యను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కోయిల్‌కొండ క్రాస్‌రోడ్డులోని విజ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నాగరాజు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు సాయిల్‌గౌడ్

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** జిల్లాలో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిల్ గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓఎస్ భవనంలో పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిల్ గౌడ్, గౌరవాధ్యక్షుడిగా ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా బాలకిషన్, నారాయణరెడ్డి, మోహబూబ్ అలీ, బురానుద్దీన్, సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య ఆచారి, కోశాధికారిగా విశ్వనాథం, ప్రచార కార్యదర్శిగా బాలరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం సాయిల్ గౌడ్ మాట్లాడుతూ.. పెన్షనర్లకు ఏ సమస్య తలెత్తినా సంఘం తరపున అండగా ఉంటామన్నారు. సంఘం బలోపేతానికి అందరూ సహకరించాలని కోరారు.

### 'కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం'

**చిన్నచింతకుంట:** అన్ని రంగాల కార్మికులు వచ్చే నెల 1వ తేదీన కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మే డే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు సమష్టిగా వేడుకలు నిర్వహించి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు జేఎస్ దేవదానం, ఉపాధ్యక్షుడు వెంటన్న, ఎ.కొండన్న, అడివన్న, అంజన్న, వెంకటేశ్‌గౌడ్, రాజు, కె.చంద్రన్న, పెంటన్న పాల్గొన్నారు.

### వీహెచ్‌పీ కార్యకర్తలను సంఘటితం చేయాలి

**దేవరకద్ర:** గ్రామగ్రామానా విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలను సంఘటితం చేసి.. హిందూ ధర్మాన్ని నిలబెట్టాలని వీహెచ్‌పీ ప్రాంత సంఘటన మంత్రి సత్యంజీ కోరారు. ఆదివారం దేవరకద్ర శ్రీవాణి శిశు మందిర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అయన మాట్లాడారు. వీహెచ్‌పీ ప్రాంత అధ్యక్షుడు నరసింహ మూర్తి, జిల్లా కార్యదక్షుడు చంద్రయ్య, కార్యదర్శి నాగరాజు, ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, భరతసింహారెడ్డి పాల్గొన్నారు.

### బీసీ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** బీసీ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏల్పాటి రాజ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మోనప్పగుట్టలోని స్వర్ణకార భవన్‌లో జరిగిన బీసీ మహాసభ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య, నాయకులు బ్రహ్మయ్య, సిద్ధిరామప్ప తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

**నవాబుపేట:** మండలంలోని తీగలపల్లిలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సోమవారం నుంచి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నారాయణ, చెన్నయ్య, బాలకిష్టయ్య తెలిపారు. 28న ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 29న జలాధివాసం, 30న ఆంజనేయ స్వామి విగ్రహం, బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉంటుందని పేర్కొన్నారు.

# ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి



జిల్లా కేంద్రంలో ఏఐపీఎస్ఓ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ప్రదర్శన

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల టౌన్/అడ్డాకుల:** దేశంలో మతోన్మాదం, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని వక్తలు పేర్కొన్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్ఓ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో అశ్రునివాళి సభ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, ఏఐపీఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉబేదుల్లా కొత్వాల్, జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి ఖలీల్, సామాజిక వేత్త హనీఫ్ అహ్మద్ మాట్లాడారు. ప్రపంచ శాంతి కోసం అందరూ పాటుపడాలని కోరారు. అంతకు ముందు పహల్గాం మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్దకు నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వామన్‌కుమార్, ప్రభాకర్, గోవిందు, గట్టన్న, చంద్రాయుడు, ఆంజనేయులు, శ్రీదేవి, పి.విజయకుమార్, పి.యాదగిరి, మహ్మద్ ఫయాజ్, మొహమ్మద్ అయాజ్, అబ్దుల్ ఖాదర్, నూరుల్‌హసన్, కుర్మారెడ్డి, ఆంజనేయులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

■ పహల్గాం ఘటన మానవత్వానికి మాయని మచ్చ అని ముస్లిం సంఘాల ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మహబూబ్‌నగర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆవిర్భావ సమావేశంలో వారు మాట్లాడారు. మృతుల కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ ఈ నెల 29న జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వహీద్‌షా, బైతుల్‌ఖైర్ సొసైటీ ప్రతినిధి మహ్మద్ తఖీ, మొసీన్‌ఖాన్, అజీం సిద్దిఖీ, అబ్దుల్ జబ్బార్‌ఖాన్, నిజాముద్దీన్, కన్వీనర్లు షోయబ్‌అలీ, మహ్మద్ సలీం, కోకన్వీర్లు మహ్మద్ ఫరీద్, అజీజుర్ రహెమాన్, ఆమీర్ సొహైల్, సమీర్, నదీం మహ్మద్, అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

■ ఉగ్రదాడిని ఖండిస్తూ జడ్చర్ల మున్సిపాలిటీలో కిరాణ జనరల్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నేతాజీ చౌరస్తాలో పహల్గాం మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొట్ర మధు, ఆగీరు రాఘవ, లవకుమార్, ముజీబ్, అసద్, బాబా పాల్గొన్నారు.

■ మూసాపేట మండలం నిజాలాపూర్‌లో పహల్గాం మృతులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. కొవ్వొత్తులను వెలిగించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ సాగర్, వి.రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, గంగపూరి, శాఖాపురం శ్రీనివాసులు, టైలర్ రాములు, రఘుపతి, కృష్ణయ్య పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో సంఘీభావం తెలుపుతున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు



జడ్చర్ల పట్టణంలో..



మూసాపేట మండలం నిజాలాపూర్‌లో..

# నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు



చక్రాపూర్ స్టేజీ వద్ద వర్షానికి ధాన్యం తడవకుండా కవర్లను కప్పుతున్న రైతులు

**అడ్డాకుల:** మూసాపేట మండలంలో వరిధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. వారం, పది రోజులుగా ధాన్యాన్ని కల్లాల్లో ఉంచుకుని రైతులు.. కొనుగోళ్ల కోసం పడిగాపులు కాస్తున్నారు. నిజాలాపూర్, నందిపేట, చక్రాపూర్, వేముల తదితర గ్రామాల్లో దాన్యం కొనుగోళ్లు ఆశించిన మేర సాగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల హమాలీలు రావడం లేదని.. మరికొన్ని చోట్ల బస్తాల కొరత వంటి కారణాలతో కొనుగోళ్లు మందగించాయి. ఇదిలా ఉంటే, అకాల వర్షాలు, ఈదురు గాలులకు ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. రోజు సాయంత్రంవేళ ఈదురు గాలులు, జల్లులు కురుస్తుండటంతో ధాన్యం తడుస్తోంది. మళ్లీ ధాన్యాన్ని ఆరబెట్టడానికి కూలీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో అదనపు ఖర్చు అవుతోందని రైతులు వాపోతున్నారు. కాగా, కొమిరెడ్డిపల్లి, జానంపేట, చక్రాపూర్ స్టేజీ వద్ద సర్వీస్ రోడ్లు ధాన్యంతో నిండిపోయాయి. జిల్లా అధికారులు దృష్టి సారించి.. వరిధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మైసమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం



ప్రత్యేక అలంకరణలో మైసమ్మ దేవత



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

**నవాబుపేట:** మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి.. అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో మైసమ్మ దేవతకు పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి నామస్మరణతో మైసమ్మ అడవి మార్మోగింది. దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి. ఆలయ పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# అన్ని గ్రామాల్లో జై సంవిధాన్ పాదయాత్ర



యన్మన్‌గండ్లలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నవాబుపేట:** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తూ.. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య అన్నారు. ఆదివారం యన్మన్‌గండ్ల, ఇప్పటూర్, కారూర్, కూచూర్, కారుకొండ, తీగలపల్లి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచే చర్యలు చేపడుతోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలు, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠ, మాజీ అధ్యక్షుడు వాసుయాదవ్, భూపాల్‌రెడ్డి, హమీద్, రాజు, బాలయ్య, కిరణ్, ఆశన్న, సత్యనారాయణ, సత్యం, నర్సింహ, ఉమర్, ఆంజనేయులు, కుమార్, శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్, ఖాజామైనొద్దీన్ పాల్గొన్నారు.

# సేవాభావమే ముఖ్యం



వీరశైవ సమాజం జిల్లా నూతన కార్యవర్గం

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** లింగాయత్‌లు సేవాభావంతో జీవిస్తారని, అందరికీ సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటారని వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షుడు ముక్త శ్రీశైలం అన్నారు. ఆదివారం స్థానిక టీచర్స్‌కాలనీలోని రామాలయంలో సంఘం జిల్లా, మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవే పరమావధి అని పేర్కొన్నారు. కాగా, వీరశైవ సమాజం జిల్లా గౌరవాధ్యక్షుడిగా జంగం శివరాజ్, అధ్యక్షుడిగా ముక్తా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా గాజుల మృత్యుంజయ, కోశాధికారిగా చీరాల రాజశేఖర్, ప్రచార కార్యదర్శిగా ఏల్పాటి రాజ్‌కుమార్, గౌరవ సలహాదారుగా కాన్‌కుర్తి సిద్ధిరామప్పను ఎన్నుకున్నట్లు తెలిపారు.

# రజతోత్సవ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



మిడ్జిల్ నుంచి సభకు తరలివెళ్తున్న నాయకులు

**సాక్షి నెట్‌వర్క్:** వరంగల్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. అన్ని గ్రామాలు, పట్టణాల నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో బీఆర్ఎస్ శ్రేణులు బయలుదేరగా.. పార్టీ ముఖ్యనాయకులు జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు.

# ఈదురు గాలులకు నేలకొరిగిన భారీ వృక్షం

- మూడు కార్లు ధ్వంసం



చెట్టుకొమ్మలు విరిగిపడి ధ్వంసమైన కారు

**జడ్చర్ల:** పట్టణంలోని కావేరమ్మపేటలో ఆదివారం వీచిన గాలి దుమారానికి ఓ భారీ వృక్షం నేలకొరిగింది. చెట్టుకింద నిలిపిన మూడు కార్లు ధ్వంసమయ్యాయి. మదర్సా సమీపంలో ఉన్న భారీ వేప చెట్టు రెండు శతాబ్దాలుగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ చెట్టు చుట్టూ రచ్చకట్ట నిర్మించగా.. స్థానికులు సేద తీరే వారు. విశాలమైన స్థలంలో భారీ వృక్షం ఉండటంతో కావేరమ్మపేట వాసులకు ఓ వేదికగా ఉపయోగపడేది. ఇలాంటి మహా వృక్షం ఒక్కసారిగి ఓవైపు చీలి నేలకొరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ జ్యోతి అక్కడికి చేరుకొని పరిశీలించారు. అదే విధంగా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించారు.

**పిడుగుపాటుతో ఎద్దు మృతి**

**చిన్నచింతకుంట:** మండలంలోని మద్దూర్‌లో పిడుగుపాటుతో ఓ కాడెద్దు మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. మద్దూర్‌కు చెందిన రైతు తెలుగు కుర్మన్న తనకున్న నాలుగు పశువులను గ్రామ సమీపంలోని పశువుల కొట్టంలో కట్టి ఉంచాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో కాడెద్దు పిడుగుపాటుకు గురై మృతి చెందింది. కాడెద్దు విలువ రూ. 70వేలు ఉంటుందని.. ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

# మే డేను దీక్షా దినంగా పాటించాలి



మాట్లాడుతున్న చంద్రకాంత్

**మహబూబ్‌నగర్ న్యూటౌన్:** అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పండుగలా కాకుండా దీక్షా దినంగా జరుపుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి చంద్రకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే డే కార్మికుల ఐక్యతకు నిదర్శన మని అన్నారు. హక్కుల సాధన కోసం కార్మికులు సమష్టి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ జి.రాజ్ కుమార్, వివిధ సంఘాల నాయకులు ముక్తార్ ఖాన్, ఆంజనేయులు, యాదగిరి, శ్రీశైలం, సాయిలు, నరసింహ తదితరులు ఉన్నారు.